# చెత్తకుండీ

## - శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

ఆరోజు ఆదివారం. ఆంధ్రకేసరి పార్కుకు అశేష జనం తండోపతండాలుగా తరలివచ్చారు. 'తర్క శాస్త్ర ప్రవీణ' 'వితండ వాద ధురీణ', 'సమస్త ఆధునిక లోకజ్ఞాన విషయ గ్రహణ గ్రాహణ పారీణ, 'ఉపన్యాస పంచానన', 'వక్తృత్వ కళాశ్రీ కంఠాభరణ' శ్రీశ్రీశ్రీ జంధ్యాల శాస్త్రిగారు ఒక మహోపన్యాసం చేయబోతున్నారు. జనానికి గంగవెర్రులెత్తించ బోతున్నారని వినికిడి.

శాస్త్రిగారు శాలువా సవరించుకొని, ఒక చేతిలో మైకు పుచ్చుకొని, మరోచేతిని టేబులుపై మోపి, గంభీరంగా ఆత్మవిశ్వాస పూర్వక కంఠధ్వనితో ఉపన్యాసం మొదలుపెట్టారు.

''నాయనలారా! ప్రస్తుత పరిస్థితులలో మన నిత్య జీవితావసర వస్తువులకై మనము ఆందోళన చేయవలసి యున్నది. నిన్నటివరకు వీధికొక మందు దుకాణము కావలసిన గట్టి ఆవశ్యకతపై నొక్కి వక్కాణించితిని. నేటి విషయమంతకన్న ముఖ్యమైనది.

పేట కొక్కబడి పెట్టుచున్నారు. పేటకొక్క వైద్యశాల పెట్టుచున్నారు. అట్టి వైద్యశాలల కొన్నిటి వాకిళ్ళ యందు 'వధ్యశాల' అని వ్రాయబడిన బోర్డులును లేకపోలేదు. బహుశః అవి సార్ధక నామధేయములేమో!

మరి వీధికొక కల్లు దుకాణమును వెలయించు చున్నారు. మతమున కొక శ్మశానమును గూడా ప్రత్యేక ముగా పెట్టినారు.

''వీటి అన్నిటికన్నా మున్నుగా ప్రతి యింటి ముంగిట ఒక చెత్తకుండీ కావలయును.

మన మహిళామణులు బహు సుకుమారులు. నేటి సూపర్ అమ్మోనియా, యూరియా తిండ్లతో సుపీరియర్ సుకుమారులు అయిపోవుచున్నారు. మరియు నిది యాంత్రిక యుగము. పురుషునితో సమానముగా స్త్రీ ఎంచబడుతున్న సమతాయుగమిది, స్వర్ణ యుగమిది. 'నౌకరీ లేనా? నవలా రచనలేనా? నటనలేనా? నాట్యము లేనా? ఆటలేనా? పాటలేనా? చిత్రరంగమా, పత్ర రంగమా? మేస్త్రీ పనులే కాదు, కుస్తీ పోటీలందు కూడా. బిజినెస్సే కాదు, బిజీగా ఉండుటలో కూడా. చివరకు గుడ్డలు కట్టుటలో కూడా. ఒక్క 'బిడ్డలను కనుట' అను అంశము నందు తక్క అన్నింటను స్త్రీలు పురుషునితో పోలుచున్నారు. పోటీ పడుతున్నారు. అట్టి యెడ నేటి యాంత్రీకృత జీవితములలో పురుషునికెట్లు తీరిక తక్కువో స్త్రీకిని అంతే.

''నేడు ఎక్కడో వీధి కొక్క చెత్తకుండీ మాత్రమే యుండుచున్నది. మన ఆడువారుగాని, పనికత్తెలుగాని కొంపలలోని చెత్తపారవేయు వలెనన్న వీధి చివరనున్న చెత్తకుండీ వరకు పోయి రావలసి యున్నది. కాలము బహువిలువైనది. వీధి చివరి వరకు వెళ్ళి చెత్తవేసి రావలయునన్న అది విలువైన కాలమును వ్యర్థపరచుటయే. అట్టి పని వివేకమనిపించుకొనదు. మరియు మాట్లాడిన అది సంస్కార రాహిత్య మందును. కాలము విలువ కనకము కన్న ఘనము. ఆ చెత్త అక్కడ వేసి వచ్చులోపల మన మధ్య తరగతి కుటుంబ స్త్రీలు ఎన్నో రచనలు చేయగలరు. ఎన్నియో అల్లికలు కూర్చగలరు. ఆ అల్లికలు లేనిచో మన గృహాంగణములకు అనాకారితనము వాటిల్లగలదు. ఆ మహిళా రచనలు రానిచో మన పత్రికా పాఠకులకు పిచ్చి యెక్కు ప్రమాదమును కలదు.

''కనుక నాయనలారా! నేటి నుండి మన ప్రధాన కోరిక-ఇంటికొక్క చెత్తకుండీ.

ఇది కేవల మొక సామాన్యపు కోరిక కారాదు. ముందు మునిసిపాలిటీ అధికారులకు, అవసరమైనచో ఆ శాఖా మంత్రివర్యులకు, అప్పుడును కాకపోయినచో ముఖ్యమంత్రి వరకు, లేకపోయిన ప్రధాని వరకు ఈ చెత్తకుండీ విజ్ఞాపన పోవలసినదే. ఇంటికొక్క చెత్తకుండీ సాధింపలేని మన యింత జనాభా, జవ సత్త్వములు ఎందుకు? కాల్పనా? మనమేమైనా ఉక్కు ఫ్యాక్టరీ అడుగుచున్నామా? యూనివర్సిటీ అడుగుచున్నామా? ఉద్యోగము అడుగుచున్నామా? ఉపకార వేతనము అడుగుచున్నామా? విద్య నడుగుచున్నామా? వైద్యము నడుగుచున్నామా?

మనకు కావలసినది చెత్తకుండీలే. అవి రానినాడు రైలు పట్టాలైనను పీకవలె. ఆర్టీసీ బస్సుల నైనను కాల్చవలె. తంతి తీగెలను తెంచవలె. వంతెనలను పగులగొట్టవలె. అవసరమైనచో ఆత్మాహుతి కూడా చేసుకొందుమని ప్రకటించవలె. అప్పుడుగాని ప్రభుత్వం దిగిరాదు. మనకు చెత్తకుండీలు రావు.

అసలు నేడు మన కాపురములలో పెరుగుచున్న చెత్తకు ఇంటికొకటియైనను చాలదేమో! ఒకని యింటిలో మనుచరిత్రాదులైన పాత చింతకాయ పచ్చడి పొత్తములు చెత్తకావచ్చును. మరియొకని యింటిలో 'రమణి', 'రసిక ప్రియా'ది రస గ్రంథ సంచికలు తప్ప మరి యే యితర పుస్తకమైనను చెత్తకావచ్చును. ఆ ప్రక్క యింటిలో కల్తీ కల్లు కుండల చెత్త అయిన, ఈ ప్రక్క యింటిలో మురిగిపోయిన గుడుంబాలు, ఆ మూల యింటిలో ఆడిపారేసిన పేక ముక్కలైనచో, ఈ మూల యింటిలో కొరికి పారేసిన అవుడొక్కలు. దోసెడు కొంపలో పసుల త్రొక్కిడి మా యింట; ముసుగు మనుషుల అలికిడి మా ప్రక్క యింట. ఇంటింటికీ ఏదో ఒక చెత్త. అందులకే అనుచున్నాను- ఇంటికొక్క చెత్తకుండీ ఇమీడియెట్టుగా కావాలి అని.

''సోదరులారా! ఇంకను అర్థము కాలేదా వాని అవసరము? ఇంకను మీలో జాగృతి రాలేదా? ఆవేశము రాలేదా? ఉద్వేగము ఉద్భవించలేదా? ఉద్యమమునకు మీరు ఇంకను ఉద్యుక్తులు కాలేదా? మీరేమి విరాగులా? చెత్తకుండీలకైనను ఆందోళన చేయలేని మీరు ఎట్లు బాగుపడగలరు? ఎట్లు సంసారము చేయగలరు? ఎట్లు బిడ్డలను కనగలరు? ఇంతేనా మన ఐకమత్యము? ఈ చెత్త కుండీల ఉద్యమము ఇట్లు రిత్తవో వలసినదేనా?

''వీలులేదు. అటుల కారాదు. ఇంటికొక్క చెత్తకుండీ కార్యకర్త ముందుకు రావలె. 'చెత్తకుండీ' బ్యాడ్జీయే మన కార్యకర్తల గుర్తు. తెల్లగుడ్డపై చెత్తకుండీ బొమ్మ- అదే మన ఉద్యమపు జెండా.

''బోలో చెత్తకుండీకి! జై!''

''ఇంటికొక చెత్తకుండీ! కావాలి! కావాలి!''

''చెత్తకుండీ! రిత్తవోదు!''

ఉద్యమిస్తే! రాకపోదు!


''ప్రధానమంత్రీ! మొండిపట్టు!

కూడదయ్యా! విడిచిపెట్టు

చెత్తకుండీల్! పంచిపెట్టు!''- ఇవే మన వీర నినాదాలు.

''మన ఉద్యమమునకు అంగ బలమే కాక అర్థబలమును కొంత అవసరము. దానికై విరాళములు సేకరించవలె. అవసరమైనచో అప్పులు కూడ చేయవలె. దారుణముగా ఋణములు తేవలె. మరి ఎవరైనా ఇలాటి పవిత్ర ఉద్యమము మరొకటి యేదైన నడుపుచున్నారేమో నాలుగు రాష్ట్రము లందును గాలింపుడు. ఆ ఉద్యమకారుల నుండి మనము దీర్ఘకాలిక ఋణ సహాయమును పొంద యత్నింతు ము.

''అక్కడక్కడ ఉద్యమమునకు వెన్నుపోటు పొడుచు వారుందురు. అట్టివారిని పసిగట్టి, పట్టి, కట్టి, పెట్రోలు



నందు ముంచి కాల్చివేయుడు. ఇప్పుడు మనకు శాంతి, సహనములు పనికిరావు. భూత దయకు సమాధి కట్టుడు. అడ్డము వచ్చినచో అమ్మనైనను అడ్డముగా నరికివేయుడు. మీరు అందరూ ధైర్యముగను, స్థిర చిత్తులు గను ఉండవలెను. మీ కందరకూ అంత గా భయమైనచో నాచుట్టును క్రమ్ముకొనుడు. మీకు నేనున్నాను, నాకు మీరు వున్నారు. ఆపైన భగవంతు డున్నాడు. ఆ భగవంతుడన్న గుర్తుకు వచ్చినది. మనకు దైవ బలము కూడా కావలయును. నేడే మీరందరూ గడ్డములను పెంచుకొనుడు. మీమీ వాకిళ్ళ ముందు చెత్తకుండీ లేర్పడగనే మీమీ జుట్టులను ఆ యేడుకొం డలవాని కిచ్చిరండు. ఆ వెంకటేశ్వరుడు తప్పకుండగ మనకు చెత్తకుండీల నిప్పించగలడు. కనుక ఆ దేవునకు నీలాల నిచ్చెదమని నేడు మీరందరూ మ్రొక్కుకొనుడు.

ఇది కేవలము మీ యొక్క, నాయొక్క ఉద్యమము కారాదు. ఇది ఒక జాతీయోద్యమము. గాంధీజీ, కందుకూరి మొదలైన మహాత్ముల జాబితాలో మీరందరూ చేరిపోవుదురు. చెత్తకుండీలు సాధించి మీమీ జన్మలను చరితార్థము చేసికొనుడు. చెత్తకుండీలు

సాధించుటే మన ఏకైక లక్ష్యము.

మనము చచ్చినను చెత్తకుండీ మాత్రము బ్రతుకవలె.

''అయినచో మరియొక సమస్య కలదు. మరి యింటి కొక్క చెత్తకుండీ కావలయునన్న సామాన్య విషయమా? మునిసిపాలిటీ వారి 'చెత్త' హెడ్ ఆఫ్ ఎకౌంటు లోని నిధులన్నియు ఖర్చు పెట్టినను ఇన్ని కుండీలు రాగలవా? అయినను వారికి గల ఖర్చు ఈ చెత్త ఖర్చు ఒక్కటియేనా? మరెన్ని 'చెత్తలో!' మరివారు క్రొత్త పన్నులు వేయవలసి వచ్చును. వేయమనుడు. 'చెత్తపన్ను' వసూలు చేయమనుడు. ఇంటి కింత చెత్తయున్న యింత పన్ను. ఇంత లేకపోయినను పన్ను. పెరిగిన పన్ను. తరిగిన పన్ను. అసలు లేకపోయినను పన్ను. పన్ను మీద పన్ను. సర్చార్జి; సర్వీసు చార్జీ- ఇట్లు చెత్త పన్ను చెత్తగా వసూలు చేసి చెత్తకుండీలకై వెచ్చించ వలసినదే. అన్నమైనను మానుకొని పన్నైనను కట్టెదమే కాని చెత్తకుండీలను మాత్రము వదలి పెట్టము.

సినిమా చార్జీలు ఎంత పెంచినను చలన చిత్రములు చూచుట మానుచున్నామా? అశ్లీల చిత్రములైనను చూచుచున్నామే! ద్వంద్వార్థ సంభాషణా సంభరిత చిత్రములైనచో మహారాజ పోషకుల మైపోవుచున్నామే! పనికిరాని చెత్త సినిమాలు చూచుట కన్నా పనికి వచ్చు చెత్తకుండీకై పన్నులు కట్టుట మేలు కదా? ఎన్నో అనారోగ్య అభ్యాసములు కల్గి యుండుట కన్న శుభ్రత కోసమై స్ట్రీట్ సైడు వేస్ట్ బిన్ను ముఖ్యముకాదా? చివరకు చచ్చుచు గూడ మరణ సుంకము కట్టుచున్నామే. కాటి సుంకమునిచ్చుచున్నామే. అట్టి యెడ చెత్త సుంక మొక లెక్కా?

''చెత్త కుండీల ప్రాముఖ్యమును చెత్తగా తీసి పారవేయకుడు. చేవ లేని యిళ్ళున్నవి గాని చెత్తలేని యిళ్ళున్నవా? చేతకాని వాళ్ళున్నారుగాని చెత్త పోగులు లేని లోగిళ్ళున్నవా? మనసులలోని చెత్త తీసి వేసుకొనుట చేతగాక పోవుగాక! కనీసము ఇళ్ళలోని చెత్తనైన పారవేయమా? అందులకైన యింటి కొక్క చెత్తకుండీ కావలసిలేదా?

కనుక మహాజనులారా! యోచింపుడు. చెత్తకుండీల సాధనాందోళనకు వీర కంకణధారులు కండు. కటి బద్ధులు కండు. అనల్ప కఠోర దీక్షా దక్షులు కండు. లెండు. ఉవ్వెత్తుగ లెండు. త్రాచుల వలె లెండు. రేచులవలె సాగుడు. పంచాస్యాలై గర్జించుడు. నిప్పుకణాలై చెలరేగుడు. వెంటనే ఇంటికొక్క చెత్తకుండీని చేర్పించనిచో ఉన్నవాటిని గూడ పగులగొట్టెదమని బెదిరించుడు. చెత్తకుండీలు ప్రదానము చేయలేని ప్రభుత్వమును చేతులకు గాజులు తొడుగుకొని, గద్దె దిగి, మూల కూర్చొనుమనుడు.

''పొరపాటు. నాదియే తప్పు. గాజులు తొడుగు కొనుట యన్న స్త్రీలకు కోపము వచ్చును. అయినను నిందులో చేతగాని వారెవరు? అసలు స్త్రీ గాని, పురుషుడుగాని కానివారెవ్వరు? పౌరుషములేని వారెవ్వరు? ఒకవేళ అట్టి వారెవరైనా యున్నచో వారి సంగతి మన కనవసరము ప్రస్తుతమునకు.

''మరి నేటి నుండియే మన ఉద్యమము మొదలు. చెత్తకుండీయే మన ఏకైక లక్ష్యము. అది మన ఆరవ ప్రాణము. అంతియేగాదు, అది మన ఆరాధ్య దైవము.

''జై చెత్తకుండీ! జై జై చెత్తకుండీ!'' అంటూ వీరావేశంతో నినదిస్తూ శాస్త్రిగారు ఉపన్యాసం ముగించారు.

నిజంగానే జనానికి గంగవెర్రు లెత్తాయి. అక్కడికక్కడే మహోద్ధృతపు అలజడి. అందోళనా కందళిత జనసాంద్ర మహాసాగర చైతన్య రంగోత్తుంగ తరంగాల గందరగోళం.

★★★

తెల్లవారే సరికి పత్రికలలో పతాకశీర్షికలు- ''భగ్నమన్న చెత్తకుండీ''- 'ఆరు ఆర్టీసీ బస్సుల దహనం'- 'పోలీసు కాల్పులు'- '..మృతులు..క్షతగాత్రులు'- 'పోలీసు కాల్పులపై ఖండనలు...మండనలు'- 'విద్యాలయాల మూసివేత'- నగరాల బందులు'- 'జన జీవన స్తంభన' అంటూ.

★

**(పండిత కవులలో మేటి 'పానుగంటి' వారి జయంతి (ఫిబ్రవరి 11వ తేదీ) సందర్భంగా వారిని స్మరించుకుంటూ ఈ కథ.... -రచయిత)**